## కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 30, పచ్చిమిర్చి 60, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 30, ఆలు 40, చామ 60, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్‌ 80, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 35, క్యారెట్‌ 60, చిక్కుడు 80, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3)20 ,క్యాలీఫ్లవర్‌ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 200, వెల్లుల్లి 300.

## జునైద్‌ఖాన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థి జునైద్‌ఖాన్‌కు పీహెచ్‌డీని ప్రకటించారు.'మనూ'లోని పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ విభాగంలో జునైద్‌ఖాన్‌ 'అర్బన్‌ లోకల్‌ గవర్నెన్స్‌ ఇన్‌ జమ్మూ అండ్‌ కశ్మీర్‌: ఏ స్టడీ ఆఫ్‌ శ్రీనగర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆయన పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ అబ్దుల్‌ ఖయ్యూం పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. జునైద్‌ఖాన్‌ పబ్లిక్‌ అడ్మినిస్ట్రేషన్‌ విభాగంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

## ఉపాధ్యాయులకు సన్మానం



చందానగర్‌: చందానగర్‌ జిల్లా పరిషత్‌ పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హోప్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ కొండ విజయ్‌ కుమార్‌ హాజరై మాట్లాడుతూ ఉపాధ్యాయులు బదిలీపై ఎక్కడికి వెళ్ళినా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు సునీత, సరళను సన్మానించారు. ఉపాధ్యాయ సంఘం మండల నాయకులు హనుమంతు, ప్రధానోపాధ్యాయులు సుభాష్‌, పద్మలత, యూసుఫ్‌, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.





కాలనీలో చెత్త, చెట్లకొమ్మలు



కాలనీలోని వరదనీటి కాలువ దుస్థితి

# సమస్యలు పట్టించుకునే వారేరీ..?

**దీప్తిశ్రీనగర్‌ వాసుల ఆవేదన**

మియాపూర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని దీప్తిశ్రీనగర్‌ కాలనీలో గుంతల రోడ్లు, మురుగు ప్రవాహం, అస్తవ్యస్త పారిశుధ్యం, ఫుట్‌పాత్‌ ఆక్రమణలు, అక్రమ పార్కింగ్‌, ట్రాఫిక్‌ సమస్య, డంపింగ్‌ యార్డు ఇలా పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు సమస్యలు పట్టించుకోకపోవడంతో ఇబ్బందులుపడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. దీప్తిశ్రీనగర్‌ కాలనీ 1989లో ఏర్పాటైంది. 77 ఎకరాలలో విస్తరించింది. ప్రస్తుతం కాలనీలో అపార్ట్‌మెంట్లు, ఇళ్లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. సుమారు 18 వేల మంది జనాభా నివసిస్తున్నారు.

**కాలనీ సమస్యలు..**

- కాలనీలో గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయి. గత సంవత్సరం కొన్ని సీసీ రోడ్లు వేశారు. మిగతా రోడ్లన్నీ వాటర్‌ , డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్వి వదిలేశారు. రోడ్లను తవ్విన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో కొన్ని రోజులకే గుంతలమయంగా మారాయి.
- రోడ్ల పక్కన, ఎక్కడపడితే అక్కడ చెత్త, చెదారం, చెట్లకొమ్మలు దర్శనమిస్తున్నాయి. పాత ట్రాన్స్‌ఫార్మర్‌లతో విద్యుత్‌ సమస్యలు తలెత్తుతున్నాయి. పలుచోట్ల కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి.
- కాలనీలో 10 పార్కులు ఉండగా రెండు పార్కులు మాత్రమే స్థానికులకు అందుబాటులో ఉన్నాయి. మిగతా పార్కులన్నీ చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి అడుగు పెట్టలేని పరిస్థితి ఉంది. మరికొన్ని పార్కులకు ప్రహరీ లేకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి.
- ప్రధానరోడ్డులో వ్యాపార సముదాయాలకు పార్కింగ్‌ స్థలం లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు పార్క్‌ చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిస్తుండడంతో తరచు ట్రాఫిక్‌ సమస్య తలెత్తుతుంది.
- ఈ కాలనీ సమీపంలో డంపింగ్‌ యార్డు ఉండడంతో శేరిలింగంపల్లిలోని పలు కాలనీల నుండి చెత్త తరలించే ఆటోలు, భారీ వాహనాలు వెళ్తుంటాయి. దీంతో చెత్త నుంచి దుర్వాసన వెదజల్లడంతో బాటు దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నారు.
- డంపింగ్‌ యార్డు కాలనీకి సమీపంలో ఉండడంతో కుక్కలు సంచారం పెరిగింది. ఇవి వాహనదారుల వెంటపడుతుండడంతో తప్పించుకోబోయి ప్రమాదాల బారిన పడుతున్నారు.
- వరద నీటి కాలువలు, నాలాల్లో పూడిక , చెత్తా చెదారం అసంపూర్తిగా తొలగించడంతో నీరు రోడ్లపై ప్రవహిస్తోంది.
- ధర్మపురి క్షేత్రం రోడ్డులో తరచూ మ్యాన్‌హోళ్లు పొంగి మురుగునీరు రోడ్లపై పారుతోంది. అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పైప్‌లైన్‌లలో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోంది.
- ఈ కాలనీకి చెరువు సమీపంలో ఉండడంతో దోమలు పెరిగిపోయాయి. సాయంత్రం ఐతే దోమల బెడద తట్టుకోలేకపోతున్నామని ,ఫాగింగ్‌ చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.









దీప్తిశ్రీనగర్‌ కాలనీలో అధ్వాన్న రోడ్లు

## 10 నుంచి రాజయోగ మెడిటేషన్‌ రీట్రీట్‌

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్‌ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో రెండు రోజులపాటు రాజయోగ మెడిటేషన్‌ రీట్రీట్‌ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆగస్టు 10వ తేదీ ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమై 11వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుంది. ఇందులో పాల్గొనే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్‌ 040-23001234, సెల్‌ నంబర్‌ 8087411206లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## రంగనాథస్వామికి ప్రత్యేక పూజలు



షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం నేపథ్యంలో గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, స్థానిక నాయకులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ మండపం వద్ద శాశ్వత ప్రాతిపదికన షెడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. సీనియర్‌ నాయకులు రాజు, సత్య రంగస్వామి, అనిల్‌కుమార్‌, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## నిఫ్ట్‌లో ఫ్యాషన్‌షో







నిఫ్ట్‌ ఆడిటోరియంలో అలరించిన ఫ్యాషన్‌షో

మాదాపూర్‌: జాతీయ చేనేత దినోత్సవంను పురస్కరించుకుని మాదాపూర్‌లోని నిఫ్ట్‌ (నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ)లో బుధవారం హాత్‌కర్గా ఉత్సవ్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వస్త్రాలు ధరించి ర్యాంప్‌వాక్‌ చేశారు. కార్యక్రమంలో భాగంగా హ్యాండ్‌లూమ్‌ ప్రతిజ్ఞ, క్విజ్‌, స్టైలింగ్‌ కాంపిటీషన్‌, ఫ్యాషన్‌షో తదితరాలను నిర్వహించారు .

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్‌, రమేష్‌ తదితరులు

మియాపూర్‌: మియాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలో ఎలమంచి ఉదయ్‌కిరణ్‌ యువసేన ట్రస్ట్‌ ఆధ్వర్యంలో బుధవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్‌, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్‌తో కలిసి విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టపడి చదవాలని సూచించారు .కార్యక్రమంలో నాయకులు నల్ల సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్‌, సాంబశివరావు, కృష్ణగౌడ్‌, తిరుపతి, తాండ్ర రామచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతాం



మొక్కలు నాటిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, అధికారులు



గోపన్‌పల్లిలోని చిన్నపెద్దచెరువు వద్ద మొక్క నాటిన కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి, అధికారులు

ఆల్విన్‌కాలనీ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని ఎల్లమ్మ చెరువు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో డీసీ కృష్ణయ్య, ఆల్విన్‌కాలనీ డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌తో కలసి ఎమ్మెల్యే గాంధీ మొక్కలు నాటారు. అనంతరం చెరువులో దోమల లార్వా నిర్మూలనకై ఎంఎల్‌ఓ ఆయిల్‌ బాల్స్‌ను వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా కాలనీలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ అసోసియేషన్‌ సభ్యులు, కాలనీవాసులు, సామాజికవేత్తలు, జీహెచ్‌యంసీ అధికారులు ఏఈ శ్రావణి, ఏఎంఓహెచ్‌ మమత, ఇరిగేషన్‌ ఏఈ విశ్వం, ఎంటమాలజి సూపర్‌వైజర్‌ నర్సింహ, వర్కు ఇన్‌స్పెక్టర్‌ రవి, కాంగ్రెస్‌ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**గోపన్‌పల్లిలో..**

రాయదుర్గం: గోపన్‌పల్లిలోని చిన్నాపెద్ద చెరువు వద్ద స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి బుధవారం నీటిపారుదల, జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానికులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ మొక్కల పెంపకం అవసరమని అన్నారు. చిన్నపెద్ద చెరువు, మురుగు కాలువలో దోమల నివారణకు ఆయిల్‌ బాల్స్‌ వేశారు. కార్యక్రమంలో సర్కిల్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ సంజయ్‌, ఇరిగేషన్‌ ఏఈ నాగరాజు, ఎంటమాలజిస్ట్‌ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్గనైజర్‌ శ్రీకాంత్‌, నాయకులు పాల్గొన్నారు.

## బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం

గచ్చిబౌలి: మసీదుబండలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంను బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ పాల్గొన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌ యాదవ్‌ కుటుంబం అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో మసీదుబండవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్పొరేటర్‌కు వినతి



కార్పొరేటర్‌ను కలిసిన పాస్టర్లు

మియాపూర్‌: వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ పేర్కొన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని చర్చిల పాస్టర్లు కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ... డివిజన్‌ పరిధిలోని చర్చిల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూడా ఎమ్మెల్యేతో చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు స్వామి, వందన్‌కుమార్‌, ఫిలిప్‌, శామ్యూల్‌, నాగేశ్వర్‌రావు, డేవిడ్‌, కిషోర్‌, విల్సన్‌, బాలరాజు, జాన్‌రాజ్‌, కుమార్‌, సువార్తరాజు తదితరులు పాల్గొన్నారు.

## చిరాక్‌ నూతన క్యాంపస్‌ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: విజన్‌ ఫర్‌ సక్సెస్‌ అనే నినాదంతో నగరంలోని శేరిలింగంపల్లి వేదికగా చిరాక్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ నూతన క్యాంపస్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ సంచిత రాహా మాట్లాడుతూ ఐఐఆర్‌ఎఫ్‌ ర్యాంకింగ్‌లో రాణించిన తమ స్కూల్‌ నూతన అధ్యాయాలను సృష్టించడానికి మరో వేదికను ఆవిష్కరించిందని తెలిపారు. ఈ సరికొత్త క్యాంపస్‌ 9.5 ఎకరాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించబడిందన్నారు.

## హైటెక్స్‌లో ముగిసిన ట్యూబ్‌ అండ్‌ పైప్‌ ఫెయిర్‌

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని హైటెక్స్‌ ఆవరణలోని ట్యూబ్‌ అండ్‌ పైప్‌ ఫెయిర్‌ బుధవారం ముగిసింది. ఈ విషయాన్ని నగరానికి చెందిన సంభవ్‌ స్టీల్‌ ట్యూబ్స్‌ లిమిటెడ్‌ ప్రతినిధులు తెలిపారు. ఈ ఈవెంట్లో తమ సంస్థతో పాటు అత్యాధునిక సాంకేతిక పరికరాలు కూడా ప్రదర్శించారన్నారు. తమ ఉత్పత్తులకు సంబంధించి నగరవాసుల నుంచి వచ్చిన స్పందన సంతృప్తిని అందించిందన్నారు.

## ఇనార్బిట్‌మాల్‌లో జాతీయ చేనేత దినోత్సవం

మాదాపూర్‌: మాదాపూర్‌లోని ఇనార్బిట్‌లో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదిత్య బిర్లా ఫ్యాషన్‌, రిటైల్‌ లిమిటెడ్‌ ఆర్టిసానల్‌ లైఫ్‌స్టైల్‌ బ్రాండ్‌ ఆధ్వర్యంలో మగ్గంపై నేత నేశారు. ఈ కార్యక్రమం ఈనెల 10వ తేదీ వరకు జరుగనుంది. ఉచిత ప్రవేశం. ఈ సందర్భంగా జైపూర్‌ క్రియేటివ్‌ హెడ్‌ రాధికాచబ్రా మాట్లాడుతూ భారతదేశ చేనేత హస్తకళల వారసత్వాన్ని ప్రపంచానికి అందించడమే లక్ష్యమన్నారు.

## పర్యాటక, ఆతిథ్య రంగాలలో మంచి అవకాశాలు



కార్యక్రమంలో పాల్గొన్న పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, పలు స్టార్‌ హోటళ్ల జీఎంలు

- రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులు, నిథమ్‌ డైరెక్టర్‌ ఇలాత్రిపాఠి
- నిథమ్‌లో 'టూరిజం టౌన్‌హాల్‌' నిర్వహణ

రాయదుర్గం: పర్యాటక, ఆతిథ్య రంగాలలో మంచి అవకాశాలు ఉంటాయని రాష్ట్ర పర్యాటక శాఖ సంచాలకులు, నిథమ్‌ డైరెక్టర్‌ ఇలాత్రిపాఠి స్పష్టం చేశారు. బుధవారం 'నిథమ్‌'లో 'పర్యాటక టౌన్‌హాల్‌' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ నైపుణ్యం ఉన్న వారికి మంచి అవకాశాలు ఉంటాయన్నారు. రాడిసన్‌ గ్రూప్‌ సౌత్‌ ఆసియా జనరల్‌ మేనేజర్‌ సందీప్‌జోషి మాట్లాడుతూ పర్యాటక, ఆతిథ్య పరిశ్రమ కఠినమైందని, కానీ ఎదుగుదలకు కూడా అవకాశం ఉంటుందన్నారు. తాను జీఎం కావడానికి 15 ఏళ్లు పట్టిందని, నేడు ఏడేళ్లలోనే ఆ స్థాయికి చేరుకోవచ్చన్నారు. నేర్చుకోవడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నోవాటెల్‌ కన్వెన్షన్‌ సెంటర్‌ జనరల్‌ మేనేజర్‌ రూబిన్‌ చెరియన్‌ మాట్లాడుతూ ఈ రంగాలు మహిళలకు ప్రత్యేకమైన వన్నారు. తాజ్‌కృష్ణ జనరల్‌ మేనేజర్‌ పంకజ్‌ సంపత్‌ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే శ్రమించే తత్వం, ప్రతిభావంతులకు మంచి అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం ప్రశ్నోత్తరాల సమయం నిర్వహించారు. నిథమ్‌ ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఎం కే గణేష్‌ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ విజయలక్ష్మీ, మిషెల్లీ జీ ఫ్రాన్సిస్‌, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధులు, అధికారులు, ఎంబీఏ, బీబీఏ, బీఎస్సీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అసంపూర్తి పనులను పూర్తి చేయిస్తాం



ప్రొఫెసర్స్‌ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే గాంధీ, అధికారులు, స్థానికులు

గచ్చిబౌలి: కాలనీల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గాంధీ సూచించారు. బుధవారం కొండాపూర్‌ డివిజన్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్స్‌ కాలనీలో పర్యటించారు. అనంతరం సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు దశలవారీగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రొఫెసర్స్‌ కాలనీలో అసంపూర్తిగా మిగిలిపోయిన యూజీడీ, రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ రమేష్‌, నాయకులు ప్రసాద్‌, సైదేశ్వరరావు, దీపక్‌, కాలనీవాసులు గోపి, సిద్దార్థ్‌, అరుణ్‌, అజిత్‌, ప్రభాకర్‌, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఉపాధి ఆధారిత విద్య అవసరం



మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్‌ అధికారి డా.జయప్రకాశ్‌ నారాయణ

**మాజీ ఐఏఎస్‌ అధికారి డా.జయప్రకాశ్‌నారాయణ**

రాయదుర్గం: దేశంలో ఉపాధి ఆధారిత విద్య అవసరమని, ప్రపంచవ్యాప్తంగా విద్యాపరంగా మనం అధ్వానంగా ఉన్నామని మాజీ ఐఏఎస్‌ అధికారి, రాజకీయవేత్త డాక్టర్‌ జయప్రకాశ్‌నారాయణ పేర్కొన్నారు. గచ్చిబౌలి హెచ్‌సీయూలోని జాకీర్‌ హుస్సేన్‌ లెక్చర్‌ హాల్‌లో 'యూనియన్‌ బడ్జెట్‌ అన్‌ ది బ్రాడర్‌ ఎకానమీ' అనే అంశంపై ఏబీవీపీ హెచ్‌సీయూ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్‌ ఆర్థిక క్రమశిక్షణలో అద్భుతమని అన్నారు. విద్య, ఆరోగ్య సంరక్షణకు మరిన్ని పరిష్కారాలు అవసరమన్నారు. ఐఎస్‌బీ ఫైనాన్స్‌ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ప్రసన్నతంత్రి మాట్లాడుతూ మెరుగైన విద్య, నైపుణ్యాలు వంటి దీర్ఘకాలిక చర్యలు ముఖ్యమైనవన్నారు. దేశంలో అసంఘటిత కార్మికులు ఉన్నారని వారికి సానుకూలంగా చర్యలుండాలన్నారు. హెచ్‌సీయూ ఏబీవీపీ అధ్యక్షుడు బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సాక్షి, ఏబీవీపీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలు పంపిణీ



గచ్చిబౌలిలోని బర్లకుంట వద్ద మొక్కలు పంపిణీ చేస్తున్న జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: మానవ మనుగడకు మొక్కల పెంపకం అవసరమని వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం వెస్ట్‌ జోన్‌ పరిధిలో బర్లకుంట లేక్‌ వద్ద స్థానికులతో కలిసి మొక్కలు నాటి, పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్క నాటడంతోనే సరిపెట్టు కోకుండా చెట్టు అయ్యేంత వరకు సంపూర్ణ రక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్‌ రజనీకాంత్‌ రెడ్డి, డీడీ అనిల్‌కుమార్‌, ఇరిగేషన్‌ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి మధులిక, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పోషకాహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న యూనిసెఫ్‌-ఇండియా హైదరాబాద్‌ ప్రతినిధి డాక్టర్‌ జెలాలెమ్‌ టాఫెస్‌

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీలో యూనిసెఫ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్‌ ముగిసింది. దాదాపు 25 మంది యూనిసెఫ్‌ ప్రతినిధులు, రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ నుంచి కార్యనిర్వాహకులు, పోషకాహార నిపుణులు, క్షేత్ర పరిశోధకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్‌-ఇండియా హైదరాబాద్‌ ఫీల్డ్‌ ఆఫీస్‌ చీఫ్‌ డాక్టర్‌ జెలాలెమ్‌టాఫెస్‌ మాట్లాడుతూ చిన్నారులకు పోషకాహారం అందేలా కృషి చేయాలన్నారు. 0-2 సంవత్సరాల వయస్సు పిల్లలకుమంచి పోషకాహారాన్ని అలవాటు చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని మూడు జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అందులో ఆదిలాబాద్‌, కామారెడ్డి, గద్వాలలో క్షేత్ర పరిశోధనలో కనుగొన్న విషయాలపై ఈ సందర్భంగా కూలంకషంగా చర్చించారు. పండ్లు, ఆకుకూరల వినియోగం తప్పనిసరి అన్నారు. పంచదార బిస్కెట్లు, సులభంగా ప్యాక్‌ చేసిన ఆహారాలను పిల్లలకు ఇవ్వకుండా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ ప్రొఫెసర్లు వాసుకీ బెలవాడి, ఉషారమణ్‌, డాక్టర్‌ రవికాంత్‌, యూనిసెఫ్‌ ప్రతినిధి ఆదిత్యలోమస్‌, సీఎస్‌బీసీ అశోకా యూనివర్సిటీ ప్రతినిధులు, యూనిసెఫ్‌ ఫీల్డ్‌ ఆఫీస్‌ ప్రతినిధి సీమాకుమార్‌ పాల్గొన్నారు.

## ఏఐ స్టార్టప్‌ల అభివృద్ధికి పూర్తి సహకారం

**మ్యాథ్‌ సీఈఓ రాహుల్‌ పైత్‌**

రాయదుర్గం: ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ ఆధారిత స్టార్టప్‌ల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని మెషిన్‌ లెర్నింగ్‌, ఆర్టిఫీషియల్‌ ఇంటెలిజెన్స్‌ టెక్నాలజీ హబ్‌ (మ్యాథ్‌) సీఈఓ రాహుల్‌పైత్‌ చెప్పారు. హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ వేదికగా బుధవారం హ్యాకథాన్‌ కార్యక్రమం వివరాలను ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ హ్యాకథాన్‌ ఏఐ భవిష్యత్‌ను రూపొందించే ఆవిష్కరణ, సహకారం, రూపాంతర ఆలోచనలకు కేంద్రంగా ఉపయోగపడుతుందన్నారు. జీఏఐఎస్‌-2024కి దారితీసే మ్యాథ్‌ హ్యాకథాన్‌ 2.0లో పాల్గొనేవారికి పరిశ్రమ నిపుణులతో సన్నిహితంగా మెలగడానికి, అత్యాధునిక సాంకేతికతలను అన్వేషించడానికి, ఏఐ కమ్యూనిటీకి అర్థవంతంగా సహకరించడానికి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు.

**మ్యాథ్‌హ్యాక్‌ 2.0 ప్రకటన**

గ్లోబల్‌ ఏఐ ఇన్నోవేషన్‌ సమ్మిట్‌-2024కి ముందు 36 గంటల ప్రీమియర్‌ ఏఐ హ్యాకథాన్‌ను మ్యాథ్‌ బుధవారం ప్రకటించింది. ఇందులో విజేతలుగా నిలిచినవారు రియల్‌ టైమ్‌ వరల్డ్‌ కేసెస్‌పై పనిచేయడానికి ప్రత్యేక అవకాశాలను కల్పిస్తారు. ఈ హ్యాకథాన్‌లో 20వేల దరఖాస్తుల నుంచి 50 ప్లస్‌ తుది జట్లను ఎంపిక చేస్తారు. గ్లోబల్‌ ఏఐ ఇన్నోవేషన్‌ సమ్మిట్‌ (జీఏఐఎస్‌-2024) సందర్భంగా సెప్టెంబర్‌ 5న ఫైనల్‌ పిచ్‌ ఈవెంట్‌తో ఈ హ్యాకథాన్‌ ముగుస్తుంది. ఈ హ్యాకథాన్‌ను టీహబ్‌ వద్ద నిర్వహిస్తారు.

## కాలనీల్లో కార్పొరేటర్‌ పర్యటన

పటాన్‌చెరు టౌన్‌: డివిజన్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్‌ మెట్టుకుమార్‌ యాదవ్‌ అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని పలు కాలనీలలో కార్పొరేటర్‌ పర్యటించారు.పాత మార్కెట్‌ రోడ్డులోని డ్రైనేజీ వ్యవస్థను స్థానిక దుకాణాల యజమానులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ సిబ్బందికి ఎప్పటికప్పుడు డ్రైనేజీ లైన్లను శుభ్రం చేయాలని కార్పొరేటర్‌ సూచించారు.

## సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

పటాన్‌చెరు టౌన్‌: ప్రతి ఒక్కరు సైబర్‌ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పటాన్‌చెరు ఏఎస్‌ఐ అక్బర్‌ ఖాన్‌ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌ చౌరస్తాలో సైబర్‌ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... బ్యాంకు నుండి కాల్‌ చేస్తున్నాం... క్రెడిట్‌ కార్డ్‌ అప్డేట్‌ చేయాలని, పార్ట్‌టైం జాబ్‌ల పేరిట, అధిక లాభాల ట్రేడింగ్‌ పేరుతో జరుగుతున్న మోసాల గురించి ప్రజలకు వివరించారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చే లింకులకు స్పందించకూడదని తెలిపారు. ఎవరైనా సైబర్‌ నేరాలకు గురైతే వెంటనే టోల్‌ ఫ్రీ నెంబర్‌ 1930కు కాల్‌ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

## 10, 11 తేదీల్లో జేఎన్‌టీయూలో మెగా జాబ్‌ ఫెయిర్‌

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో ఈ నెల 10, 11 తేదీల్లో మెగా జాబ్‌ ఫెయిర్‌ను నిర్వహించనున్నారు. యూనివర్సిటీ ఇండస్ట్రీ ఇంటరాక్షన్‌ సెంటర్‌తో కలిసి పరవస్తు క్రియేటివ్‌ ఫౌండేషన్‌, నిపుణ హ్యూమన్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ, హెచ్‌ఆర్‌ కో ఆధ్వర్యంలో జాబ్‌ ఫెయిర్‌ నిర్వహించనున్నారు.సుమారు 100 కంపెనీలు పాల్గొని వేలాదిగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. పది, ఇంటర్‌, డిగ్రీ, పీజీ, బీ.ఫార్మ్‌, ఎం.ఫార్మ్‌ చదువుకున్న వారు అర్హులు. ఐటీ, మేనేజ్‌మెంట్‌, ఫార్మా, కోర్‌, బ్యాంకింగ్‌, ఎఫ్‌ఎంసీజీ, రిటైల్‌ వంటి సెక్టార్‌లలో ఉద్యోగాలు అందించనున్నారు. ఎటువంటి రిజిస్ట్రేషన్‌ రుసుము చెల్లించనవసరం లేదు. మరిన్ని వివరాలకు 8121212873, 7337373575 నంబర్లలో సంప్రదించాలి.